## క్లుప్తంగా

### 108 ఉద్యోగికి ఆర్థిక సాయం



సంతోష్‌కు ఆర్థిక సాయం చేస్తున్న 108 ఉద్యోగులు

**విజయనగరం ఫోర్ట్:** ప్రమాదంలో గాయపడిన 108 ఉద్యోగికి తోటి ఉద్యోగులు ఆర్థిక సాయం అందజేశారు. 108 సంస్థలో ఫ్లీట్ మెకానిక్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న జి.సంతోష్ అంబులెన్సుకు మరమ్మత్తులు చేస్తుండగా కాలుపై అంబులెన్సు పడడంతో కాలు విరిగింది. దీంతో ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. అతనికి 108 ఉద్యోగులు రూ.34,300 ఆర్థిక సాయాన్ని ఆదివారం విజయనగరంలోని ఆయన నివాసంలో అందజేశారు. కార్యక్రమంలో 108 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వేమలి అప్పలనాయుడు, శ్రీను, రామకృష్ణ, విశ్వనాథం, వెంకరమణ, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

### 'చదవడం మాకిష్టం'కు మంచి స్పందన



పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

**డెంకాడ:** మండలంలోని డెంకాడ శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న 'చదవడం మాకిష్టం' కార్యక్రమానికి విద్యార్థుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొని తమకు నచ్చిన పుస్తకాలు చదివారు. వారికి లైబ్రేరియన్ వై.మహేష్ అల్పాహారాన్ని అందించారు.


### పాము కాటుతో ఆవు మృతి



మృతి చెందిన ఆవు

**నెల్లిమర్ల రూరల్:** పాము కాటు వేయడంతో ఆవు మృతి చెందిన ఘటన మండలంలోని చనమళ్లపేట గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పతివాడ అప్పలనాయుడుకు చెందిన ఆవు పొలంలో మేత మేస్తుండగా పాము కాటు వేసింది. ఆవు అపస్మారక స్థితికి చేరుకోవడాన్ని గమనించిన రైతు వెంటనే పశు వైద్యాధికారులకు సమాచారం అందించారు. పశు సంచార వాహనంతో వైద్య సిబ్బంది అక్కడికి చేరుకొని పరీక్షించగా పరిస్థితి విషమించడంతో ఆవు అప్పటికే మృతి చెందింది.

### అమ్మవారికి పంచామృతాభిషేకాలు



అమ్మవారికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు

**చీపురుపల్లి:** స్థానిక కనకమహాలక్ష్మి ఆలయంలో అమ్మవారికి ప్రధాన అర్చకులు ఆరవెల్లి రవిశర్మ నేతృత్వంలో ఆదివారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి ప్రత్యేక రోజు కావడంతో ప్రతీ వారం అభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరుకుమార్ నేతృత్వంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

### సీతారామలక్ష్మణుల విగ్రహాల ఊరేగింపు



విగ్రహాల ఊరేగింపులో భక్తులు

**దత్తిరాజేరు:** మండలంలోని కోమటిపల్లి గ్రామ రామాలయంలో సోమవారం ప్రతిష్ఠించనున్న సీతా,రామ,లక్ష్మణుల విగ్రహాలను ఆదివారం ఉద యం ఆలయ కమిటీ సభ్యులు మేళ, తాళాలు,కోలాటాల మధ్య ఊరేగించారు. గతంలో ఈ మందిరంలో సీతా,రామ,లక్ష్మణుల చిత్ర పటాలు ఉండేవి. వాటి స్థానంలో విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. అయోధ్య రామమందిరంలో బాలరాముడి ప్రాణప్రతిష్ట ముహూర్తానికే ఇక్కడ సీతా, రామ,లక్ష్మణుల విగ్రహాలను ప్రతిష్ఠిస్తామని కమిటీ సభ్యులు చెప్పారు. రామాలయం వద్ద మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహిస్తామని చెప్పారు.

## ● నాడు వెలవెల నేడు కళ కళ



నాడు: నగర పాలక సంస్థ కార్యాలయం




నేడు: అభివృద్ధి చెందిన తర్వాత నగర పాలక సంస్థ కార్యాలయం

జిల్లా కేంద్రంలోని నగర పాలక సంస్థ కార్యాలయం ఒకప్పుడు వెలవెలబోయేది. అరకొర సౌకర్యాలతో అటు సిబ్బంది, ఇటు ప్రజలు కూడా ఇబ్బంది పడేవారు. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక నగర పాలక సంస్థ కార్యాలయాన్ని చక్కగా తీర్చిదిద్దారు. పూర్తిస్థాయి సదుపాయాలు కల్పించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

## కాంగ్రెస్ విధానం దేశానికి ప్రమాదం



బవిరెడ్డి శివప్రసాదరెడ్డి

**విజయనగరం టౌన్:** కాంగ్రెస్ విధానం దేశానికి ప్రమాదమని బీజేపీ అధికార ప్రతినిధి బవిరెడ్డి శివప్రసాదరెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. అయోధ్యలో నిర్మించిన భవ్య రామాలయంలో సోమవారం బాలరాముడు విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి హాజరుకామని కాంగ్రెస్ నేతలు చెప్పడం దురదృష్టకరమన్నారు. 500 ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని అయోధ్య రామాలయం నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో ప్రజల సహకారంతో నిర్మించుకుని ప్రపంచ దేశాల దృష్టిని భారతదేశం వైపు తిప్పుకునేలా చేసి రామరాజ్య స్థాపనకు శ్రీకారం చుడుతున్నామన్నారు. ఇటువంటి సమయంలో దేశంలో ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఈ కార్యక్రమంలో పాల్గొనమని ప్రకటించడం చాలా బాధాకరమన్నారు.

# వైభవంగా శ్రీరాముడి శోభాయాత్ర



ఆర్టీసీ కాలనీలో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

**విజయనగరం టౌన్:** పురాణ పురుషుడైన శ్రీరాముడు జన్మించిన అయోధ్యలో శ్రీరామ ప్రతిష్ట సందర్భంగా యావత్ భారతావని శ్రీరామ నామస్మరణతో మార్మోగుతోంది. ఇందులో భాగంగా నగరంలోని కంటోన్మెంట్ ఆర్టీసీ కాలనీలో ఆదివారం సాయంత్రం శ్రీరామ శోభాయాత్ర ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. రామభక్తులు, హిందూ ధర్మ సమాజం, ప్రజలు పెద్ద సంఖ్యలో శోభాయాత్రలో పాల్గొన్నారు. రాముని కీర్తనలు, భజనపాటలు, కోలాటం, డప్పు వాయిద్యాల నడుమ ఆర్టీసీ కాలనీ, మెయిన్ రోడ్డు, ఉడా కాలనీలో శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో 43వ డివిజన్ కార్పొరేటర్ సత్యవతి, రమణి, రాములు, అప్పలాచారి, కమిటీ సభ్యులు, పెద్దలు గంగునాయుడు, రమణమూర్తి, వెంకటేశ్వరరావు, భగవాన్ దాస్, అప్పారావు, గోపీనాథ్, విజయలక్ష్మి, సుగుణ, భారతి, త్రివేణి, బుజ్జి, భక్తులు పాల్గొన్నారు.

**నేడు 'శ్రీరామ శోభాయాత్ర'**



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సేవాసంఘం ప్రతినిధులు

**నెల్లిమర్ల:** అయోధ్యలో శ్రీరామ మందిరంలో నేడు బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ట సందర్భంగా నెల్లిమర్ల రామతీర్థం జంక్షన్ వద్ద ఉన్న ఆంజనేయ స్వామి విగ్రహం నుంచి రామతీర్థం ఆలయం వరకు 'శ్రీరామ శోభాయాత్ర' నిర్వహిస్తున్నట్లు శ్రీరామతీర్థం సేవా సంఘం అధ్యక్షుడు ఆర్.గోవిందరావు, నెల్లిమర్ల నగరపంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు తెలిపారు. స్థానిక రామతీర్థం జంక్షన్ ఆర్చిగేటు పరిసరాలను ఆదివారం పరిశీలించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. థామస్ పేట దుర్గా పీఠాధిపతులు శ్రవణ చైతన్య చిన్న గురుస్వామి ఆధ్వర్యంలో 2000 మంది భక్తులతో శోభాయాత్ర నిర్వహించనున్నట్లు చెప్పారు. సంఘ కార్యదర్శి సుదర్శనం విజయకుమార్ మాట్లాడుతూ యాత్రలో పాల్గొనే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా దాతల సహకారంతో దారి పొడుగునా తాగునీరు, మజ్జిగ అందివ్వనున్నామని, రామతీర్థం స్వామి వారి దర్శనం తరువాత అన్నప్రసాదం ఏర్పాటు చేసామని తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గోల్డెన్ ట్రీ అధినేత బాడాన రాజశేఖర్, సంఘ కోశాధికారి ముంతా ప్రసాదరావు, భోగాపురపు రామకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

## కులగణన సర్వేను త్వరగా పూర్తి చేయండి



సవరవిల్లిలో కులగణన సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ అప్పలనాయుడు

**భోగాపురం:** మండలంలో చేపడుతున్న కులగణన సర్వేను పకడ్బందీగా చేపట్టి త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ నీలం అప్పలనాయుడు సూచించారు. మండలంలోని అన్ని గ్రామ సచివాలయ పరిధిలో కులగణన కొనసాగుతోంది. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. సవరవిల్లి, వెంపాటపేట, ఉప్పాడపేట తదితర గ్రామాల్లో జరుగుతున్న కులగణన సర్వేను ఎంపీడీఓ అప్పలనాయుడు ఆదివారం పరిశీలించారు. ఈనెల 28లోగా కులగణన ప్రక్రియను పూర్తి చేయాలని, యాప్‌లో సర్వే అంశాలను సమగ్రంగా పొందుపరచాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంతోష్, వలంటీర్లు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్సీ రామ్మూర్తికి ఘన నివాళి



గానాల రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం నాయకులు

**విజయనగరం:** విశ్వబ్రాహ్మణ సామాజికవర్గ రాజకీయ దురంధురుడు, ఉమ్మడి మద్రాస్ రాష్ట్ర మాజీ ఎమ్మెల్సీ బహదూర్ గానాల రామ్మూర్తి జయంతి ఉత్సవాలు ఆదివారం నగరంలో ఘనంగా జరిగాయి. స్థానిక విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కామాక్షమ్మ కళ్యాణ మండపంలో నిర్వహించిన 134వ జయంతి ఉత్సవాల్లో భాగంగా సంఘం ప్రతినిధులు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా 4వ డివిజన్ కార్పొరేటర్ మారోజు శ్రీనివాసరావు, లక్కోజు ఓంకార్ మాట్లాడుతూ.. ఉమ్మడి మద్రాస్ రాష్ట్రానికి ఎమ్మెల్సీగా సేవలందించి విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేసిన గొప్ప వ్యక్తి రామ్మూర్తి అని కొనియాడారు. తమ సంఘాన్ని, సామాజికవర్గాన్ని బీసీలో చేర్చేందుకు దేశ వ్యాప్తంగా పర్యటించి కులస్తుల స్థితిగతులను ప్రభుత్వానికి తెలియజేసి అనుకున్నది సాధించిన గొప్ప నాయకుడని పేర్కొన్నారు. విశ్వబ్రాహ్మణులు రాజకీయాలు చేయటంలో తొలి బీజం వేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బంగారు దేవుడు, లక్కోజు అప్పలాచారి, వరహాచారి, సోమరాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ధర్మానికి నిలువెత్తు రూపం శ్రీరాముడు



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

**విజయనగరం టౌన్:** ధర్మానికి నిలువెత్తు రూపం శ్రీరాముడని సంస్కార భారతి జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. స్థానిక హుకుంపేటలో ఉన్న శ్రీఆర్య సోమయాజుల కాశీపతిరావు స్మారక భవనంలో ఆదివారం భారత మాతకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దైవభక్తి, దేశభక్తి నేటితరానికి తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం భగవతి నృత్యకళామందిర్ విద్యార్థినులు చేసిన నృత్య ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో సంస్కార భారతి ప్రతినిధులు సంతోషి, రమణకుమారి తదితరులు పాల్గొన్నారు.

### కాషాయ జెండాలు, ప్రమిదల పంపిణీ



అక్షతలు, కాషాయ జెండాలు, ప్రమిదలను పంపిణీ చేస్తున్న సత్యసాయి సేవాసమితి సభ్యులు

**బొండపల్లి:** అయోధ్య రామాలయంలో సోమవారం బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ నిర్వహించనున్న నేపథ్యంలో కొవ్వాడపేటలో సత్యసాయి సేవాసమితి సభ్యులు ఆదివారం ఇంటింటికీ అయోధ్య అక్షతలు, కాషాయ జెండాలు, మట్టి ప్రమిదలు పంపిణీ చేశారు. ప్రతీ ఇంటిపై జై శ్రీరామ్ పేరుతో ఉన్న కాషాయ జెండాలు కట్టాలని కోరారు. సోమ వారం మధ్యాహ్నం ప్రతీ ఇంటిలో దీపాలు వెలిగించి, పూజలు చేయాలని సూచించారు.

### గడ్డివాము దగ్ధం

**జామి:** మండలంలోని ఆర్.బి.పురం గ్రామంలో ఎర్రతాత కల్లంలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఆదివారం గడ్డివాము దగ్ధం అయింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గుర్తు తెలియని వ్యక్తులు కాల్చిన సిగరెట్టు పడేయడంతో గడ్డి వాముకు మంటలు వ్యాపించాయి. ఎస్.కోట అగ్నిమాపక శాఖకు సమాచారం అందించడంతో ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక




2003-04 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు

**డెంకాడ:** మండలంలోని జొన్నాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003–04 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం ఘనంగా జరిగింది. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా కుటుంబ సభ్యులతో కలిసి కలుసుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. నాటి మధుర స్మృతులను గుర్తుచేసుకుంటూ రోజంతా ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కోరాడ కోటినాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు త్రిపురగిరి దేవి, నిర్మలానందస్వామి, పూర్వ విద్యార్థులైన వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు రామ్మూర్తినాయుడు, రత్నమాల, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, ఈశ్వరరావు, సత్యశ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## లెనిన్ ఆశయ సాధనకు కృషి చేద్దాం



లెనిన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

**విజయనగరం పూల్‌బాగ్:** మానవాళి విముక్తికి మార్గం చూపిన మహానేత లెనిన్ ఆశయ సాధనకు కృషి చేద్దామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రెడ్డి శంకర్రావు పిలుపునిచ్చారు. లెనిన్ శత వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక కలెక్టరేట్ వద్ద ఆదివారం నిర్వహించారు. లెనిన్ చిత్రపటానికి సీపీఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు పి.రమణమ్మ, జగన్మోహన్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గ్రామదేవతల తీర్థం



కొత్తవలస: రాజుపాత్రునిపాలెంలో అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్న భక్తులు

**కొత్తవలస:** మండలంలోని రాజుపాత్రునిపాలెం గ్రామంలో రావాలమ్మ తల్లి తీర్థం గ్రామపెద్దల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి పూలజ్యోతిని, చెక్క గుర్రాలను ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాల మధ్య ఊరేగించారు. అమ్మవారికి గ్రామస్తులతో పాటు సమీప గ్రామాల నుంచి వచ్చిన భక్తులు కుంకుమ పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళల కోలాటం, పలురకాల జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి.

**అరిగిపాలెం, ఆతవలో..**



వేపాడ: ఆతవలో పూజలందుకుంటున్న వేమాలమ్మ తల్లి

**వేపాడ:** మండలంలోని అరిగిపాలెంలో గ్రామదేవత చుక్కమాంబ, ఆతవలో వేమాలమ్మ తీర్థం ఆదివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవార్లకు ఆయా గ్రామా ల భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. తీర్థం నేపథ్యంలో నిర్వాహకులు పలుసాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

## అన్ని వర్గాలకు మేలు చేశాం...

- టీడీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి
- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన ఎమ్మెల్యే అప్పలనరసయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య



సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు

**బొండపల్లి:** రాష్ట్రంలో కుల,మతాలు,పార్టీలకు అతీతంగా అన్ని వర్గాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మేలు జరిగిందని, అర్హులందరికీ పథకాలు అందించిన ఘనత ముఖ్య మంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. గొట్లాం గ్రామంలోని సత్యఫంక్షన్ హాల్‌లో మండలస్థాయి వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఈనెల 27న భీమిలిలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తరాంధ్ర వైఎస్సార్‌సీపీ నా యకులతో ఎన్నికల శంఖారావ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు.ఈసభకు మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు, గృహ సారథులు, వలం టీర్లు,నామినేటెడ్ పదవుల్లో ఉన్నవారు, డైరెక్టర్లు, నాయకులు హాజరు కావాలని కోరారు. అలాగే వచ్చే నెల 4న వైఎస్సార్ అసరా సంబరాలను మండల సముదాయం వద్ద నిర్వహించనున్నామని, ఈ సంబరాలకు 10 వేల మంది డ్వాక్రా సంఘాల సభ్యులు హాజరయ్యేలా చూడాలని కోరారు. అలాగే వైఎస్సార్ చేయూత లబ్ధిదారులు మండ లంలో 4,500 మంది ఉన్నారని, వారందరితో కూడా సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈమూడు సమావేశాలను విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతీ నాయకు డిపై ఉందన్నారు.

**దాచుకోవడం... దోచుకోవడమే గత ప్రభుత్వ నినాదం**

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో దాచుకోవడం, దోచుకోవడమే విధానంగా పాలన సాగిందని, ప్రజలకు ఒరిగింది ఏమి లేదని ఎమ్మెల్యే అప్పలనరసయ్య గుర్తు చేశారు. టీడీపీ పాలనలో ఆ పా ర్టీ నాయకులు ప్రజాధనాన్ని కొల్లగొట్టారని ఆరోపించారు. నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి శూన్యమని అన్నారు. చంద్రబాబు కంటే పెద్ద మోసగాడు మాజీ ఎమ్మెల్యే కె.ఎ.నాయుడు అని, వారు చెప్పే కల్లబొల్లి మాటలను నమ్మి మోసపోవద్దని ప్రజలకు హితవు పలికారు. ఎమ్మెల్సీ పెనుమత్స సూర్యనారాయణమూర్తిరాజు(సురేష్‌బాబు), ఎంపీపీ చల్లా చలంనాయుడు, జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.వి.ప్రభాజీరాజు, పార్టీ మండల అధ్యక్షుడు బొద్దల చిన్నంనాయుడు, వైస్ ఎంపీపీలు మీసాల సరోజిని, గొండేల ఈశ్వరరావు, నాయకులు బండారు బంగారం, ఈదుబిల్లి కృష్ణ, మీసాల తులసీరాం, మహంతి రమణ, బోడసింగి జగదీశ్వరరావు, గొట్టిముక్కల శివరామరాజు వర్మ, పల్లి రఘు తదితరులు పాల్గొన్నారు.